సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



నిట్‌కు త్వరలో నిధులు

ఏపీ నిట్‌లో రెండో దశ పనుల నిమిత్తం త్వరలో నిధులు రానున్నాయి. రూ.735 కోట్లు కేటాయించాలని ఇప్పటికే ప్రతిపాదనలు వెళ్లాయి. 8లో ▸



ఉపాధికి ఊతం

ఉంగుటూరు మండలంలోని బాదంపూడి మత్స్య శిక్షణ కేంద్రం యువత ఉపాధికి ఊతమిస్తోంది. సర్టిఫికెట్ కోర్సుల్లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. 8లో ▸



భక్తజన సంద్రం

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. ఆలయంలోని అన్ని విభాగాలూ భక్తులతో కిటకిటలాడాయి. 8లో ▸

న్యూస్‌రీల్

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం

మండలి చైర్మన్ మోషేన్‌రాజు



సాక్షి, భీమవరం: విజయవాడ స్వరాజ్య మైదానంలో రాష్ట్రానికే తలమానికంగా ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసేందుకు యత్నించడం హేయమైన చర్యని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. ఈ ఘటన రాజ్యాంగం, దళితులు, పేద వర్గాలపై దాడి చేయడమేనని ఆయన మండిపడ్డారు. భీమవరంలోని స్వగృహంలో శనివారం మోషేనురాజు మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా ప్రపంచ మేధావిగా, దిక్సూచిగా ఉన్నారన్నారు. అనేక మంది విద్యావేత్తలకు ఆయన ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. దళితులు, పేదవర్గాల వారు ఈరోజు అభివృద్ధి చెందుతున్నారంటే అందుకు అంబేడ్కర్ ఆలోచన విధానమే కారణమన్నారు. స్మృతివనంలోని అటువంటి మహనీయుని నిలువెత్తు విగ్రహాన్ని కొందరు వ్యక్తులు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించడం, శిలాఫలకాలను తొలగించడం రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయడమేనని మండలి చైర్మన్ మోషేనురాజు ఖండించారు. సీఎం జోక్యం చేసుకుని ఈ దుశ్చర్యకు పాల్పడిన వారు ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మోషేనురాజు అన్నారు.

ఆక్వా రంగ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఉండి: ఆక్వా రంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం వాండ్రం గ్రామ పరిధిలో రూ.10 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మాణమైన రాష్ట్ర ఫిష్, ఆక్వా ట్రేడర్స్, ప్యాకర్స్ అసోసియేషన్ భవనాన్ని ఎమ్మెల్యేలు కనుమూరి రఘురామకృష్ణంరాజు, పత్సమట్ల ధర్మరాజు, పులపర్తి రామాంజనేయులు, కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం ప్రాంతానికి రైలు సౌకర్యం పెంచేలా రైల్వే మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఏపీ ఫిష్ ప్యాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, సతీష్, నూకల రామకృష్ణ, గాదిరాజు సుబ్బరాజు, తాడినాడ బాబు తదితరులు పాల్గొన్నారు.

పొరుగు జిల్లాల్లో ఇసుక

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లావాసుల కోసం పొరుగు జిల్లాల్లో ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి శనివారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రులో 12,545 టన్నులు, పెండ్యాలలో 1,19,150 టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రులో 42,208 టన్నులు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు-1లో 3,798 టన్నులు, రావులపాడు-2లో 1,700 టన్నుల ఉందన్నారు.

17న మాలల శాంతియుత పాదయాత్ర



మాట్లాడుతున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): సుప్రీంకోర్టు ఇటీవల ఎస్సీ,ఎస్టీ కులాల రిజర్వేషన్ వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేసుకోవచ్చు అని ఇచ్చిన తీర్పు తమకు వ్యతిరేకంగా ఉందని మాల జాతి యోధుల పోరాట సంఘం నాయకులు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. స్థానిక ఏటిగట్టు వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంతో పాటు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి క్రిమిలేయర్ అంశంపై ఇచ్చిన తీర్పు తమకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఈనెల 17న ఉదయం 10 గంటలకు ఏలూరులో శాంతియుత పాదయాత్ర చేపట్టనున్నామన్నారు. అలాగే ఈనెల 21న జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

శాంతించిన గోదావరి

పోలవరం రూరల్: నదీ పరీవాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరిలో వరద క్రమేపీ తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు వద్ద 30.640 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 5.95 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతోంది. అలాగే ఎగువన భద్రాచలం వద్ద కూడా నీటిమట్టం తగ్గుతూ 31.50 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

● అయ్యో ఆయాలు

జీతాలెప్పుడిస్తారు బాబూ!

నాలుగు నెలలు.. ఎన్నో వెతలు

- జీతాల కోసం ఆయాలు, వాచ్‌మెన్లు ఎదురుచూపులు
- జిల్లాలో 1,440 మంది ఆయాలు, 185 మంది నైట్ వాచ్‌మెన్లు
- రూ.97 లక్షల వరకు వేతన బకాయిలు



ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రం చేస్తున్న ఆయాలు



భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్లు నాలుగు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత జగన్ ప్రభుత్వంలో మనబడి నాడు-నేడు పథకంలో సర్కారీ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ.15 వేల చొప్పున విద్యార్థుల తల్లులకు సాయం అందించారు. అలాగే పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు ఆయాలను, బడుల రక్షణ కోసం నైట్ వాచ్‌మెన్లను నియమించారు. వీరికి నెలకు రూ.6 వేల చొప్పున జీతాలు అందించారు.

విద్యార్థుల సంఖ్యను బట్టి..

పాఠశాలల్లో 300 మంది విద్యార్థుల వరకు ఒకరు, 600 మంది విద్యార్థులకు ఇద్దరు, 900 మంది విద్యార్థులకు ముగ్గురు, 900లకు పైగా విద్యార్థులుంటే నలుగురు ఆయాల చొప్పున నియమించారు. ఇలా జిల్లాలో 1,440 మంది ఆయాలు, 185 మంది నైట్ వాచ్‌మెన్లను నియమించారు. వీరికి ప్రతి నెలా విద్యాశాఖ నుంచి జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవి. కోస్తా జిల్లాల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి పారిశుధ్య కార్మికులు మినహా మిగిలిన వారు పెద్దగా ఆసక్తి చూపించరు. అయితే కుటుంబ పోషణకు జీతం ఆసరాగా ఉంటుందనే ఆశతో పలువురు మహిళలు ఆయాలుగా పనిచేస్తున్నారు. వీరందరికీ ఈ ఏడాది మార్చి నెల వరకు జీతాలు ఠంచన్‌గా ఇవ్వగా ఏప్రిల్, మే, జూన్, జూలై మాసాల వేతన బకాయిలు ఉన్నాయి.

నిధులు రాగానే చెల్లిస్తాం

> స్కూళ్లలో పనిచేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు నాలుగు నెలలుగా జీతాలు అందని మాట వాస్తవం. జిల్లాలో 1,440 మంది ఆయాలు, 185 మంది నైట్ వాచ్‌మెన్లకు నెలకు రూ.6 వేల చొప్పున సుమారు రూ.97 లక్షలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే జీతాలు చెల్లిస్తాం.
>
> – ఎస్.సత్యనారాయణ, మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్

ఉంచుతారా.. పీకేస్తారా.. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సమయంలో వీరికి ఆగిన జీతాలు బడులు తెరిచి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అందలేదు. దీంతో పాటు అసలు వీరిని విధి నిర్వహణలో కొనసాగిస్తారా? లేక తొలగిస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అమ్మఒడి పథకం స్థానంలో తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేలు ఇస్తామన్న హామీని ఈ ఏడాది అటకెక్కించడంతో ఆయాలు, నైట్ వాచ్‌మెన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సారూప్య పరిశ్రమలకు ప్రోత్సాహం

కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం(ప్రకాశం చౌక్): సారూప్య పరిశ్రమలు సొంతంగా ఆధునిక యంత్రాలు సమకూర్చుకోలేని సందర్భంలో ప్రత్యేక ప్రయోజన సమాఖ్య (ఎస్‌పీవీ) ఉమ్మడిగా ఏర్పడి క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకంలో యంత్రాలు సమకూర్చుకోవడానికి అవకాశం ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఒకే రకమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న 10, 15 పరిశ్రమలు ఒకేచోట ఉంటే ఈ కార్యక్రమం కింద ప్రయోజనం పొందవచ్చన్నారు. రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల ప్రాజెక్టుగల పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ గ్రాంటు 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు 20 శాతం, పరిశ్రమల యాజమాన్యం స్పెషల్ పర్పస్ వెహికల్ వాటా 10 శాతం ఉంటుందన్నారు. రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ గ్రాంటు 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు 20 శాతం, పరిశ్రమల యాజమాన్యం స్పెషల్ పర్పస్ వెహికల్ వాటా 20 శాతం ఉంటుందన్నారు. ఆయా విషయాలపై అవగాహన కలిగించేలా పరిశ్రమల ప్రతినిధులతో ఈనెల 13న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో సమావేశంలో ఏర్పాటుచేస్తామన్నారు. వివరాలకు జిల్లా పరిశ్రమలశాఖ అధికారి మంగపతిరావు, సెల్ 99592 56522లో సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి

అమానుషం

కొవ్వొత్తులతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన



కొయ్యలగూడెంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు



ఉంగుటూరులో కొవ్వొత్తులతో వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన ప్రదర్శన

కొయ్యలగూడెం: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, కూటమి సర్కారు అండతో సంఘ విద్రోహ శక్తుల దాడులు మహాత్ముల విగ్రహాలను ధ్వంసం చేసే స్థాయికి చేరిందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ధ్వజమెత్తారు. విజయవాడలోని అంబేడ్కర్ స్మృతి వనంపై జరిగిన దాడికి నిరసనగా శనివారం రాత్రి కొయ్యలగూడెంలోని కొవ్వూరు రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతి ర్యాలీ నిర్వహించారు. పాలన మాని అరాచకాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయాలని ప్రజలు చేస్తున్న డిమాండ్లను పెడదోవ పట్టించేందుకు హింసాత్మక చర్యలకు ఒడిగడుతున్నారన్నారు. రాష్ట్రం మరో బంగ్లాదేశ్‌గా మారకుండా కేంద్రం కలుగజేసుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొడ్డటి నాగేశ్వరరావు, మంతెన సోమరాజు, గంజిమాల రామారావు, సంకు కొండ, పసుపులేటి రాంబాబు, ఏలేటి చిన్న తుక్కయ్య, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, కోడెల్లి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో కదం తొక్కిన శ్రేణులు

ఉంగుటూరు: అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాలను ధ్వంసం చేయడంపై ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం సాయంత్రం భారీ నిరసన ప్రదర్శన చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహం నుంచి దళితపేటలోని అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సూచనలు మేరకు ఆయన సోదరుడు పుప్పాల చిన్నబాబు, కార్తీక్ ఆధ్వర్యం వహించారు. నాలుగు మండలాలు పార్టీ అధ్యక్షులు మరడ మంగరావు, రాయపాటి సత్తిబాబు, సంకు సత్య కుమార్, దండురాము, ఎంపీపీలు గంటా శ్రీలక్ష్మి, ధనుకొండ ఆదిలక్ష్మి, కనుమోలు ఆధామ్, జెడ్పీటీసీలు కొరిపల్లి జయలక్ష్మి, కోడే కాశీ, తుమ్మగుంట గంగాభవాని, దళిత విభాగం అధ్యక్షులు ముళ్లగిరి జాన్సన్, జయపాల్, మాంసిక్, జాన్‌బాబు, గంట లక్ష్మణరావు, మాదాసు సుబ్బారావు, ఎంపీటీసీ చాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, ఎంపీటీసీలు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే పుట్టగతులుండవ్

కైకలూరు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానిస్తే పుట్టగతులు ఉండవని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ మహాశిల్పం వద్ద దుశ్చర్యకు నిరసనగా కై కలూరు సెంటర్ శనివారం మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శన చేశారు. రాజకీయ కక్షలతో అంబేడ్కర్‌ను అవమానపరిచే చర్యలకు పాల్పడటం హేయమని డీఎన్నార్ అన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు చేయాలని లేకుంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. తొలుత తాలుకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత బీవీ రావు, ఎంపీపీలు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్లు చేబోయిన వీర్రాజు, కొల్లాటి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గంటా సంధ్య, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ఈడే వెంకటేశ్వరరావు, ఉచ్చుల చిన్నరాజు, జయమంగళ కాసులు, దారా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం జోలికొస్తే ఖబడ్దార్

దెందులూరు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం జోలికొస్తే చరిత్రలో మరిచిపోలేని గుణపాఠాన్ని నేర్పుతామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పళ్లెం ప్రసాద్ అన్నారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ దేశం గర్వించేలా మాజీ సీఎం జగన్ విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తే.. విగ్రహం వద్ద జగన్ పేరు తొలగించడం, విధ్వంసానికి దిగడం దుర్మార్గమన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఎవరికి అడ్డు వచ్చిందని అన్నారు.

దోషులను శిక్షించాలి



తాడేపల్లిగూడెంలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం: విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం వద్ద కట్టడాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన ప్రదర్శన చేశారు. పట్టణంలోని తాలూకా ఆఫీస్ సెంటర్‌లో నాయకులు మాట్లాడుతూ ఘటనను నిరసించారు. కూటమి ప్రభుత్వంలో అరాచకాలు పెరిగిపోయాయని, దాడులను ఖండించాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్ కుమార్, మానికొండ వెంకటేశ్వరరావు, బొద్దాని శ్రీనివాసు, సుబ్బారావు, రొక్కాల నాగబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు అవమానమే..



నరసాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నరసాపురం: విజయవాడలో దేశానికే తలమానికంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెలకొల్పిన అంబేడ్కర్ స్మృతివనాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన టీడీపీ దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ దళిత నేతలు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన సభ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దళిత నేతలు ఇంజేటి జాన్‌కెనడీ, కాకిలేటి మధు, వంగలపూడి ఏషయా మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని టీడీపీ కుల అహంకారులు ధ్వంసం చేసే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. అంబేడ్కర్ ఓ కులానికి చెందిన నేత కాదని, ప్రపంచానికే ఆదర్శవంతమైన భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయులన్నారు. అంబేడ్కర్ ప్రసాదించిన రాజ్యాంగం ప్రామాణికంగా అధికార పీటమెక్కిన టీడీపీ నాయకులు ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం దారుణమన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, వైఎస్సార్‌సీపీ కేంద్రపాలక మండలి సభ్యుడు పీడీ రాజు, కామన బుజ్జి, అడిదల శరత్ పాల్గొన్నారు.

మూగజీవాల లెక్క తేలనుంది

- 1 నుంచి జిల్లాలో పశుగణన
- 4 నెలల పాటు ప్రక్రియ
- ఎన్యూమరేటర్లకు శిక్షణ పూర్తి

జిల్లాలో 2019 లెక్కల ప్రకారం..

గేదెలు 5,12,142	కోళ్లు 50 లక్షలు
ఆవులు 1,36,549	కుక్కలు 14,000
మేకలు, గొర్రెలు 8,00,000	పందులు 13,000




పశువుల కొట్టాంలోని గేదెలు

ఏలూరు (టూటౌన్): ఐదేళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా జరిగే పశుగణన కార్యక్రమాన్ని వచ్చేనెల 1 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. అఖిల భారత స్థాయిలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ పశువుల లెక్కలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో 21వ అఖిల భారత పశుగణన నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

తేలనున్న లెక్కలు : జిల్లావ్యాప్తంగా ఉన్న గేదెలు, ఆవులు, కోళ్లు, బాతులు, పందులు, గొర్రెలు, మేకలు వంటి వాటి వివరాలను సమగ్రంగా లెక్కించేందుకు పశుగణన కార్యక్రమాన్ని నాలుగు నెలలపాటు నిర్వహించనున్నారు. దీంతో జిల్లాలో పశుసంపదపై పక్కాగా లెక్కలు తేలనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుని రైతులు పశు సంపదను వృద్ధి చేసుకునేందుకు రాయితీలను అందజేయనున్నాయి. గణనకు సంబంధించి ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు.

డివిజన్ల వారీగా శిక్షణ : పశుగణనకు సంబంధించి పశుసంవర్ధక శాఖ డివిజన్ల వారీగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం, ఏలూరు డివిజన్ల పరిధిలో 417 మంది ఎన్యూమరేటర్లు, 67 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈనెల 9న ఏలూరులో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఆర్.అమరేంద్ర పాల్గొని పశుగణన పోస్టర్లు ఆవిష్కరించారు.

పశుపోషకులు సహకరించాలి



> పశుగణనలో భాగంగా పశుసంవర్ధకశాఖ సిబ్బంది సర్వేతో రైతులు, వ్యవసాయ కూలీల సామాజిక ఆర్థిక స్థితిని అంచనా వేసేందుకు వీలవుతుంది. పశుసంపద తగ్గిన చోట వాటిని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పథకాలు, రాయితీలు, బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది. పశుగణనకు ప్రజలంతా సహకరించాలి. ఈ మేరకు సిబ్బందికి శిక్షణ పూర్తయ్యింది.
>
> – డాక్టర్ జి.నెహ్రూబాబు, జేడీ, పశుసంవర్ధకశాఖ, ఏలూరు

దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించాలి



ఏలూరులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలో దళిత క్రైస్తవులను దళిత ఎస్సీలుగా గుర్తించి రిజర్వేషన్‌లు కల్పించాలని ఏలూరు నగర దళిత క్రైస్తవ సంఘాలు శనివారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని బిషప్ హౌస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. తొలుత బిషప్ పొలిమేర జయరావు ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ కులాన్ని మతం నుంచి వేరు చేయాలని, మతం మారినా కుల వివక్ష కొనసాగడం శోచనీయమన్నారు. ఐసీఎం అగ్రపీఠాధిపతి బిషప్ జాన్ ఎస్‌డీ రాజు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు దళిత హోదా కల్పించాలన్నారు. జిల్లా దళిత క్రైస్తవ సంఘాల నాయకులు ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ మైఖేల్ ఇంజమూల, తోట ఆంథోనీ రాజు, పాస్టర్ల అసెంబ్లీ ప్రతినిధులు జీవన్ కుమార్, సుదర్శన రావు, ఎస్ఎల్ పాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు.

క్లుప్తంగా

కళకళలాడుతున్న నిట్ క్యాంపస్



సర్టిఫికెట్ల పరిశీలనలో అధికారులు

తాడేపల్లిగూడెం : ఏపీ నిట్‌లో ప్రథమ సంవత్సర బీటెక్‌లో చేరడానికి విద్యార్థులు రావడంతో శనివారం సందడి నెలకొంది. ఏపీ నిట్‌లో ఆప్షన్ ఎంపిక చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ప్రవేశ పత్రాలను సంబంధిత అధికారుల చేతుల మీదుగా అందుకున్నారు. నిట్‌లో 480 సీట్లు ఉండగా, వీటిలో హోం స్టేట్ కోటా కింద 240, అదర్ స్టేట్ కోటా కింద 240 సీట్లను భర్తీ చేస్తారు. 2024–25 విద్యాసంవత్సరానికి 480 సీట్లు అలాటయ్యాయి. బీటెక్‌లో ఎనిమిది బ్రాంచ్‌లకుగాను ఎంపిక చేసుకున్న బ్రాంచ్‌లో చేరడానికి సర్టిఫికెట్లను తల్లిదండ్రులతో వచ్చి పరిశీలన చేయించుకున్నారు. చేరిక ఈ నెల 14వ తేదీ వరకు ఉంటుంది. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి , డీన్ అకడమిక్ టి.కురుమయ్య తదితరులు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు.

మహిళపై దాడి ఘటనలో నలుగురిపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్: మహిళపై దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్సై వి.గోపీనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం పట్టణం నిట్ కళాశాలలో గార్డుగా బొర్రా దుర్గాభవాని, సూపర్‌వైజర్‌గా కారింకి శ్రీను పనిచేస్తున్నారు. వీరి మధ్య వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో శ్రీను భార్య మాణిక్యం, మరో ముగ్గురు మహిళలు కలిసి అప్పారావుపేటలోని దుర్గాభవాని ఇంటికి వెళ్లి దుర్భాషలాడి, గాయపరిచారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఏఎస్సై గోపీనాథ్ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురం ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిందని ఎస్సై మణికుమార్ తెలిపారు. 2021లో రూ.3,38,580 నగదును దొంగిలించగా.. కేసు నమోదైంది. ఈ కేసులో శుక్రవారం తాడేపల్లిగూడెం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్టు క్లాసు మెజిస్ట్రేట్ బి.అరుంధతి తీర్పునిచ్చారు.

మత్స్య కేంద్రం.. ఉపాధికి ఊతం

బాదంపూడిలో 50 ఏళ్లుగా చేపల పెంపకంపై శిక్షణ

ఉంగుటూరు: కోస్తా జిల్లాల్లోని ఏకైక మత్స్య శిక్షణ కేంద్రం ఉంగుటూరులో బాదంపూడిలో 1975లో నెలకొల్పారు. అప్పటి నుంచి ఇక్కడ ఏటా విద్యార్థులకు చేపల పెంపకంపై శిక్షణ ఇస్తూ వారి ఉపాధికి బాటలు వేస్తున్నారు. ఏటా మూడు నెలలు సర్టిఫికెట్ కోర్సులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. మొత్తం 4 బ్యాచ్‌లు నడుస్తాయి.

133 బ్యాచ్‌కు శిక్షణ

ఆసక్తి ఉన్న ఔత్సాహికులు, రైతులకు ఏటా సాగులో మెలకువలు, చేపలు, రొయ్యల పెంపకం, వ్యాధులు – నివారణ తదితర అంశాల్లో ఈ కేంద్రంలో శిక్షణ ఇస్తారు. ఐదో తరగతి చదివి, చదవడం రాయడం వస్తే కోర్సులో చేరవచ్చు. గతంలో కోర్సులో 40 మందిని చేర్చుకుంటే 20 మందికి స్టైఫండ్ ఇచ్చేవారు. అయితే గత కొంతకాలంగా స్టైఫండ్ ఇవ్వడం లేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 133వ బ్యాచ్ శిక్షణ పొందుతోంది. ఇంతవరకూ ఈ కేంద్రంలో 2,300 మంది శిక్షణ పొందారు.

మంచి నీటి చేపలు పెంపకంపై తర్ఫీదు

మంచి నీటి చేపలు పెంపకంపై ఇక్కడ శిక్షణ ఇస్తారు. చేప నారు ఉత్పత్తి, వలల తయారీ, వినియోగం, చేపల్లో వచ్చే వ్యాధుల నివారణపై శిక్షణ ఇస్తారు. నీటి యాజమాన్య పద్ధతులు, చేపలకు మేత ఎలా పెట్టాలి వంటి వాటిపై అవగాహన కల్పిస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన వందల మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రైవేటు హేచరీస్, ప్రైవేటు ఫీడు కంపెనీల్లో పనిచేస్తున్నారు. కొందరు చెరువులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వ శిక్షణా కేంద్రాలు ఉమ్మడి రాష్ట్రంలో బాదంపూడి, కర్నూలు, వరంగల్‌లో ఉండేవి. ప్రస్తుతం కోస్తా మొత్తానికి బాదంపూడి శిక్షణా కేంద్రమే ప్రధానం. 17 ఎకరాలలో విస్తరించి ఉన్న చేపల పెంపకం కేంద్రానికి అనుబంధంగా ఈ శిక్షణ కేంద్రం ఉండటంతో యువతకు ప్రాక్టికల్స్ నేర్చుకునేందుకు ఉపయోగపడుతుంది.



తల్లి చేపకు ఇంజెక్షన్ ఇవ్వడాన్ని నేర్చుకుంటున్న విద్యార్థులు



బాదంపూడి మత్స్య శిక్షణ కేంద్రం

ఉపాధికి ఉపయుక్తంగా శిక్షణ



ఈ శిక్షణా కేంద్రంలో 133వ బ్యాచ్‌లో శిక్షణ పొందుతున్నాను, శిక్షణలో మంచి నీటి చేపలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడి శిక్షణ నా ఉపాధికి ఉపయోగపడుతుందని అనుకుంటున్నాను.

సంజన, దెందులూరు

చేపల పెంపకంలో మెలకువలు



శిక్షణ పూర్తి చేశాక ప్రభుత్వ లేదా ప్రైవేటు ఫాంలో ఉద్యోగం లభిస్తుందని ఆశిస్తున్నాను. చేపల పెంపకంలో అన్ని విధాలా శిక్షణ ఉపయుక్తంగా ఉంది. ప్రాక్టికల్స్ బాగా ఉపయోగపడుతున్నాయి.

చరణ్, గుంటూరు

ఏపీ నిట్‌కు త్వరలో నిధుల రాక

- రెండో దశ పనుల కోసం రూ.735 కోట్లతో ప్రతిపాదనలు
- పనుల నిర్వహణకు కేంద్ర ఉన్నత విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్
- త్వరలో నిధుల విడుదలకు ఉత్తర్వులు జారీ చేసే అవకాశం



ఏపీ నిట్ పరిపాలనా భవనం

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెంలో ఉన్న ఏపీ నిట్‌లో రెండో దశ పనుల కోసం నిధులు త్వరలో రానున్నాయి. మూడేళ్ల క్రితం నిట్ రెండో దశ పనుల కోసం రూ.735 కోట్లు కావాలని కేంద్ర మంత్రిత్వ శాఖ పరిధిలోని ఉన్నత విద్యా శాఖకు అప్పట్లో ప్రతిపాదనలు వెళ్లాయి. ఆర్థిక శాఖ అనుమతితో పాటు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే లోపు ఏపీ నిట్‌లో అనూహ్య పరిణామాలు, శాశ్వత డైరెక్టర్ లేకపోవడం వంటి కారణాలతో ఈ నిధులు రావడానికి మార్గం సుగమం కాలేదు. ఏపీ నిట్ విస్తరించడం, ఫలితాలు, ఉద్యోగావకాశాలు మెండుగా వస్తున్న నేపథ్యంలో రెండో దశ పనుల కోసం ఏపీ నిట్ నుంచి వెళ్లిన ప్రతిపాదనల ఆవశ్యకతను గుర్తించి కేంద్ర ఉన్నత విద్యా శాఖ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి, నిధులను రెండు విడతల్లో మొదట రూ.428 కోట్లు, మూడో దశ పనుల కింద సుమారు రూ.325 కోట్లు ఇవ్వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలో నిధుల విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు రానున్నాయి.

రెండోదశలో చేపట్టే పనులు ఇవే

రెండోదశ నిధుల కింద రానున్న రూ.428 కోట్లతో ఆరు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలను నిర్మించనున్నారు. భవనాల నిర్మాణం కోసం రూ.314 కోట్లు, పరిశోధనాశాలల పరికరాలు, ఫర్నీచర్ కొనుగోలు నిమిత్తం రూ.114 కోట్లు వెచ్చించనున్నారు. అలాగే సింగిల్ సీటర్, బాలురు, బాలికల వసతి గృహాల భవనాలు, పీహెచ్‌డీ చేస్తున్న మ్యారీడ్ స్కాలర్‌కోసం హాస్టల్ భవనం, ఇంటర్నేషనల్ విద్యార్థులకు హాస్టల్, అకడమిక్ , డిపార్టుమెంటు ఆఫీస్ క్యాంపెయిన్ భవనం, ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంటు టవర్ నిర్మాణం, సెంటర్ ఫర్ రీసెర్చ్, సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ, ఫెసిలిటీ, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్ భవనాలు నిర్మించనున్నారు. అలాగే నాన్ టీచింగ్ ఉద్యోగుల కోసం టైప్ త్రీ క్వార్టర్లు, అధికారులు తదితరుల కోసం టైప్ 5 క్వార్టర్లు కలిపి రూ.428 కోట్లతో నిర్మిస్తారు. 24 నెలల వ్యవధిలో ఈ పనులు పూర్తి చేయాలి.

పదిశాతం తిరిగి చెల్లిస్తే చాలు

కేంద్రం రెండోదశ పనుల కింద విడుదల చేసే నిధులు రూ.428 కోట్లలో కేవలం 10 శాతం ఏపీ నిట్ చెల్లిస్తే మిగిలిన 90 శాతం నిధులను కేంద్రమే చెల్లిస్తుంది. ఈ సొమ్మును 15 ఏళ్ల వ్యవధిలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిధులపై చెల్లించాల్సిన వడ్డీలో కేవలం ఐదుశాతం మాత్రమే నిట్ చెల్లించాలి. 95 శాతం కేంద్రం చెల్లిస్తుంది. ఈ నిధులు విడుదలై పనులు పూర్తయ్యితే మూడోదశ కింద రూ.325 కోట్లతో పనులు మంజూరు చేస్తారు.

నా బండి.. నా ఇష్టం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు ద్విచక్ర వాహనదారులు రూల్స్ పట్టకుండా ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు. నెంబరు ప్లేట్ల స్థానంలో తాము ఫలానా మంత్రి తాలూకా, ఎమ్మెల్యే తాలూకా అంటూ బోర్డులు పెట్టుకుని ఏలూరు రోడ్లపై హడావుడి చేస్తున్నారు. పోలీసులు కూడా ఇంతవరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వీరి ఆటలకు అడ్డుకట్ట వేయకుంటే శ్రుతి మించే ప్రమాదం ఉంది.

– ఫొటోలు:సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు















ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ యాత్ర

ఏలూరు(టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 28 వరకు సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉజ్జయిని, ద్వారక, సోమనాథ్, పూనె, నాసిక్, ఔరంగాబాద్ వంటి పుణ్య క్షేత్రాలను సందర్శించే అవకాశం ఉందన్నారు. రైలు ఈ నెల 17న విజయవాడలో బయలుదేరి సికింద్రాబాద్ మీదుగా వెళ్తుందన్నారు. స్లీపర్ క్లాసులో పెద్దలకు రూ.20,590, పిల్లలకు రూ.19,255, స్టాండర్డ్ క్లాసులో పెద్దలకు రూ.33,015, పిల్లలకు రూ.31,440, కంఫర్ట్ క్లాసులో పెద్దలకు రూ.43,355, పిల్లలకు రూ.41,465 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు చెప్పారు. టిక్కెట్ బుకింగ్, ఇతర వివరాల కోసం విజయవాడ ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో గానీ, 92810 30714, 92814 95848 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్లకు నిధుల మంజూరు వైఎస్సార్‌సీపీ హయాంలోనే..



పెంటపాడు మండలం విప్పర్రులో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

పెంటపాడు : నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ప్రతిపాదన చేసి నిధులు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే అని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన పెంటపాడు మండలం పడమరవిప్పర్రులో రూ.3 కోట్లతో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలకు 6 నెలల ముందు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో పలు పనులు మంజూరు చేయించానని.. కాంట్రాక్టర్‌ను ప్రస్తుత ప్రజా ప్రతినిధి చెప్పుచేతల్లో పెట్టుకుని పనులు జరగకుండా చూశారన్నారు. ఆ ప్రజాప్రతినిధి అహంకార ధోరణి మానుకొని అభివృద్ధిపై దృష్టిపెట్టాలన్నారు. కూటమి నేతల్లా తాను మాయ మాటలు చెప్పలేదని.. తమ అధినేత జగన్ చేసేదే చెప్పారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే తీసుకొచ్చిన నిధులతో ఇప్పుడు పనులు జరుగుతున్నాయని చెప్పారు. వైస్సార్‌సీపీ హయాంలోని పనులు ఇప్పుడు జరుగుతున్నాయన్న అక్కసుతో కాంట్రాక్టర్‌ను అదుపులో పెట్టుకునిపనులు చేయకుండా చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ రహదారితో పాటు, మరో రూ.7 కోట్లు పెంటపాడు నుంచి విప్పర్రు వరకు మంజూరు చేయించామని.. బాదంపూడి నుంచి నవాబుపాలెం వరకు రహదారికి నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఆ పనులు తక్షణం చేయించాల్సిన పని ప్రస్తుత ఎమ్మెల్యేపై ఉందన్నారు. తనపై విమర్శలు చేయడం వల్ల ఒరిగేది శూన్యమని చెప్పారు. ఈ రోడ్లు జగన్ పాలనలో మంజూరు చేయించామని.. ఆ పనులు సక్రమంగా జరుగుతున్నాయా, లేదా చూడాల్సిన బాధ్యత మాజీ ప్రజాప్రతినిధిగా తనపై ఉందన్నారు. జగనన్న హయాంలోని పథకాలు ఆగిపోయి ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.కూటమి హామీలైన మెడికల్ కాలేజీ, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, క్రికెట్ స్టేడియం, కాపు భవనం తదితర అభివృద్ధి పనులు చేయించాల్సిన బాధ్యత ప్రస్తుత ఎమ్మెల్యేపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, గుండుమోగుల సాంబయ్య, బోణం వీరయ్య, కశిరెడ్డి అబ్బాయి, మానికిరెడ్డి వెంకటేశ్వర్లు, కైగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం.. శ్రీవారి క్షేత్రం



ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామికి ప్రీతికరమైన రోజు, అందులోను శ్రావణ మాస పర్వదినాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివెట్టి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ పూర్తిగా నిండిపోవడంతో భక్తులు ఆలయ ఆవరణలోనే బారులు తీరారు. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

క్లుప్తంగా

రక్షాబంధన మహోత్సవాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీకే రమాదేవి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బ్రహ్మ కుమారీస్ జ్ఞాన ప్రకాశ్ భవనంలో ఈ నెల 13వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు రక్షా బంధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు బీకే రమాదేవి అన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, రాజయోగిన సవిత బెహెన్, డీఎస్పీ డీఎస్ఆర్వీ ఎస్ఎన్ మూర్తి, మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ, గట్టిం మాణిక్యాలరావు, యూత్ వింగ్ కోఆర్డినేటర్ సుధాకర్‌లు హాజరవుతున్నారని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు.

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈదూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు చేసి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



వృద్ధులకు భోజనం అందజేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు భోజనం అందజేశారు. జిల్లా సభ్యులు పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఎటువంటి ఆధారం లేని వయో వృద్ధులకు ప్రతి ఒక్కరూ సాయం అందజేయాలన్నారు. మునగాల జితేంద్రచే వృద్ధులకు స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.సాయి సత్యనారాయణరాజు, జామి సత్యనారాయణ, కమిటీ సభ్యులు, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

మారంపల్లి గ్రామస్తులకు ఉచిత మంచినీరు



గ్రామస్తులకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి గ్రామస్తులకు గ్రామ సర్పంచ్ సరిపల్లి పద్మావతి, ఉప సర్పంచ్ సరిపల్లి చిట్టిబాబుల సహకారంతో ఉచిత మినరల్ వాటర్ సరఫరా కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గతంలో నిర్ణీత రుసుముతో గ్రామస్తులకు మంచినీటి సరఫరా చేసే వారన్నారు. నేడు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఇరగవరం: మండలంలో యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఈ 50 సంవత్సరాల్లో యూటీఎఫ్ సాధించిన విజయాలను కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ జీవో 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యూటీఎఫ్ అవిశ్రాంత పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి విష్ణు మూర్తి, టెన్నిసన్ రాజు విశ్వనాధం ఎస్టీయు నాయకులు సీహెచ్ భాను ప్రకాష్, తణుకు మండల నాయకులు రవికుమార్, సురేష్, జిల్లా నాయకులు ఎస్ఆర్ అప్పారావు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- జ్వరాలతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- వేలాది రూపాయలు ఖర్చవుతున్న వైనం
- దోమను చూస్తే భయమేస్తోందంటున్న ప్రజలు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో జ్వరాలతో ఇన్‌పేషెంట్లుగా ఉన్న చిన్నారులు

తణుకు అర్బన్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు సీజనల్‌గా వచ్చే జ్వరాలు విజృంభిస్తున్నాయి. తాజాగా ఏ ఆస్పత్రిలో చూసినా జ్వరంతో బాధపడుతూ వైద్యుడి కోసం వేచిచూస్తున్న పరిస్థితి తలెత్తింది. అంతేకాకుండా వాంతులు, విరేచనాలతో డయేరియా సోకి ఆస్పత్రుల్లో చేరుతున్న దుస్థితి కూడా కనిపిస్తోంది. ఆస్పత్రిలో ఎవరిని కదిలించినా జ్వరంతో బాధపడుతున్నామంటుండగా, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లలో జ్వరాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకునేందుకు కూడా రోగులు క్యూకడుతున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిత్యం జ్వరంతో చంటిపిల్లలు 30 మంది వరకు వస్తుండగా ఆస్పత్రిలోని చంటిపిల్లల వార్డులో 10 మంది పిల్లలు ఇన్‌పేషెంట్స్‌గా వైద్యసేవలు పొందుతున్నారు. ఇక పెద్దలు సైతం 10 మందికిపైగా జ్వరంతో ఆస్పత్రికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ జ్వరాల్లో అధికశాతం వైరల్ జ్వరాలు కాగా కొందరిలో టైఫాయిడ్ జ్వరాలు ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వీటితోపాటు కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరాలకు సంబంధించి నిర్వహిస్తున్న రక్తపరీక్షల్లో ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గడంతో ఆస్పత్రుల్లో చేర్పించుకుని ఖరీదైన వైద్యం అందిస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

తణుకు ఆస్పత్రుల్లో నిత్యం వెయ్యికి పైగా జ్వరం కేసులు..

తణుకు మునిసిపాలిటీ పరిధిలో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు మూడు అర్బన్ హెల్త్ సెంటర్స్, నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 30కి పైగా ప్రైవేటు ఆస్పత్రుల్లో నిత్యం వెయ్యికిపైగా జ్వరం కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. తణుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి జ్వరాల బారిన పడి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు జ్వరపీడితులు వస్తున్నారు. ముఖ్యంగా అది ఏ జ్వరమో తెలుసుకునేందుకు వేలల్లో ఖర్చవుతున్నట్లుగా రోగులు వాపోతున్నారు.

అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులతోనే..

సీజనల్ వ్యాధుల్లో భాగంగా వర్షాకాలం జ్వరాల తంతు మామూలే అయినప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా జ్వరం కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ అధికార యంత్రాంగం ప్రతిరోజూ ఎన్ని రకాలుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికీ స్థానికంగా ఉన్న అపరిశుభ్ర పరిస్థితుల కారణంగా దోమలు కుట్టి జ్వరాలు వస్తున్నట్లుగా ప్రజానీకం చెబుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో లోపం కొట్టొచ్చినట్లుగా తణుకు మునిసిపాలిటీ పరిధిలో ఉందని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. గతంలో దోమలు రాత్రి సమయంలోనే కుట్టేవని కానీ నేడు పగలు రాత్రి తేడా లేకుండా కుట్టి కుట్టి చంపేస్తున్నాయంటూ గగ్గోలు పెడుతున్నారు. డ్రెయినేజీల్లో దోమల మందు పిచికారీ చేయకపోవడం, మురుగు ఉన్న ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లించకపోవడం వలన దోమలు విలయతాండం చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతోపాటు ఖాళీ స్థలాల్లో చెత్త, పనికిరాని మొక్కలను తొలగింపచేసి దోమల నివారణకు కృషిచేయాలని పలువురు కోరుతున్నారు.

రెండు రోజులుగా ఆస్పత్రిలో

నా మనమరాలికి టైఫాయిడ్ జ్వరం సోకడంతో తణుకు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి డాక్టరుకు చూపించాను. రెండు రోజులుగా ఆస్పత్రిలో ఉంచి సిలైన్‌లు పెట్టి మంచి వైద్యం అందించారు. ఇప్పుడు నా మనమరాలు కోలుకుంది.

– బి.లక్ష్మి, తణుకు

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలి

తణుకులో పారిశుద్ధ్య నిర్వహణ ఇటీవల కాలంలో కుంటుపడింది. చేసిన చోటే చేస్తున్నారు కానీ వీధుల్లో డ్రెయిన్‌లు శుభ్రం చేయడంలేదు. దీంతో దోమల బాధ పెరిగిపోయింది. దోమలు కుట్టకుండా చూసుకోవడం మావల్ల కావడంలేదు. ఏ జ్వరాలు వస్తాయోనని భయపడుతున్నాను.

– కె.రామకృష్ణ, తణుకు

కడియద్దలో ఐదుగురిని నిర్బంధించిన గ్రామస్తులు



కడియద్ద గ్రామంలో అనుమానితులను అదుపులోకి తీసుకుని సచివాలయంలో ఉంచిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గొర్రెల దొంగలనే అనుమానంతో ఐదుగురు వ్యక్తులను గ్రామస్తులు నిర్బంధించారు. వివరాల్లోకెళితే – గ్రామంలో శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు కారుతో అనుమానాస్పదంగా సంచరించడంతో గ్రామస్తులు నిలదీశారు. దీంతో వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద నుంచి ఖాళీ సిరంజ్‌లు, డైక్లోఫినాక్ సోడియం బాటిళ్ల, రెండు చాకులు, ఒక కత్తి ఉన్నట్లు గుర్తించి వారిని పోలీసులకు అప్పగించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు నిందితులను స్టేషన్‌కు తరలించారు.

ఎర్ర కాలువ గండ్లను పరిశీలించిన అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో ఎర్ర కాలువకు ఏర్పడిన గండ్లను శనివారం ఎర్ర కాలువ డీఈతో పాటు తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ పరిశీలించారు. ఎర్ర కాలువ గండ్లు పూడ్చడానికి అయ్యే ఖర్చు అంచనాలను రూపొందించాలని డీఈ సూచించారు.

కొట్టు పరామర్శలు



విప్పర్రు గ్రామంలో సంపతరావు కృష్ణారావును పరామర్శిస్తున్న కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: మండలంలో శనివారం పలు గ్రామాల్లో మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకొన్న కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావును, తోరం వెంకట సుబ్బారావు భార్య ఇటీవల మృతి చెందడంతో ఆయనను కొట్టు సత్యనారాయణ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ముదునూరుకు చెందిన వైఎస్సార్ సీపీ మాజీ సర్పంచ్ అద్దంకి పెదవెంకటరత్నం ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు అద్దంకి బ్రదర్స్‌లను మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోసూరి వెంకట్రాజు, కర్రి భాస్కరరావు, బోణం వీరయ్య, మానికిరెడ్డి వెంకటేశ్వర్లు, గుండ మోగుల సాంబయ్య, కైగాల శ్రీనివాస్, కళిరెడ్డి అబ్బాయి, బండారు నాగు, మిరియాల శేషు, గోకా వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిల్లును వెనక్కి తీసుకోవాలి



షేక్ మాబ్, మండల కో ఆప్షన్ సభ్యుడు

ఇరగవరం: వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లుపై ముస్లింలు మండిపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులు చాలా విలువైనవి కావడంతో వాటిని ఆక్రమించుకొనేందుకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడుతున్నారని ఇరగవరం మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మాబ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంస్కరణల పేరుతో వక్ఫ్ బోర్డుకు సవరణలు చేయడం వల్ల మా హక్కులకు భంగం కలుగుతుంది. సవరణలను తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ముస్లింల హక్కులను కాలరాస్తూ స్వయం ప్రతిపత్తి కలిగిన వక్ఫ్ బోర్డు ఆస్తులను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు బిల్లు సవరణకు కేంద్ర ప్రభుత్వం చూడటం చాలా అన్యాయమన్నారు. ఈ బిల్లు మత వ్యతిరేకమైందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కుట్ర రాజకీయాలు చేస్తోందన్నారు. వెంటనే బిల్లును వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



ఢిల్లీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న పుష్పరాజ్

పెనుగొండ: ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించడంతో పాటు, క్రిమీలేయర్‌ను వర్తింప చేయాలనడం దళితులను చీకట్లోకి నెట్టివేయడమేనని, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆరోపించారు. ఛలో ఢిల్లీలో భాగంగా రెండో రోజు శనివారం తెలంగాణ భవన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించి నిరసన వ్యక్తం చేసినట్లు వివరించారు. రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలకు దూరం చేసే కుట్రలకు పాలకవర్గాలు తెరలేపాయని విమర్శించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మాలల ఓట్లు పనికి రావా అని ప్రశ్నించారు. మాలల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన నిరసనలో వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నే శ్రీదర్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, జిల్లా కార్యదర్శులు చిల్లే రాజ్‌కుమార్, కొమ్మతోటి పాలు పాల్గొన్నారు.

అన్ని కులాలనూ దామాషా ప్రకారం వర్గీకరించాలి



న్యూఢిల్లీలో ధర్నాలో మాట్లాడుతున్న నల్లి రాజేష్

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఏపీ, తెలంగాణ మాలల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శనివారం ధర్నా నిర్వహించినట్లు ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ చెప్పారు. వివరాలను స్థానిక విలేకరులకు ఫోన్‌లో వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341, ఆర్టికల్ 14కు భంగం కలిగించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ చేయవలసి వస్తే అన్ని కులాల్లో కూడా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో కూడా అన్ని కులాలను జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేసి అన్ని కులాలకు న్యాయం చేయాలని కోరారు. మాలమహానాడు జాతీయ, రాష్ట్ర నాయకులు గొల్ల అరుణ్‌కుమార్, పిల్లి సుధాకర్, మంత్రి నరసింహయ్య, సిద్దాబత్తుల కొండబాబు, నల్ల చిన్నారావు, గుండె నగేష్‌బాబు, విప్పర్తి ప్రభాకరరావు, గారపాటి నానాజి, మాల సంఘాల పెద్దలు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నట్లు రాజేష్ చెప్పారు.

రోడ్డు మార్జిన్లలో ఆక్రమణల తొలగింపు

ఆకివీడు: పట్టణంలోని ప్రధాన కూడలిలో జాతీయ రహదారి రోడ్డు మార్జిన్లలో దుకాణాల ఆక్రమణలను తొలగించేందుకు ఆకివీడు రూరల్ ఎస్సై జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై బి.నాగబాబు శనివారం చర్యలు చేపట్టారు. దుకాణదారులు రోడ్ల మార్జిన్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతోందని, యజమానులు రోడ్డు మార్జిన్లలో ఏర్పాటు చేసిన సామగ్రిని స్వచ్ఛందంగా తొలగించాలని, రోడ్డు మార్జిన్లు దాటి రావద్దని హెచ్చరించారు. షాపులకు వచ్చే వినియోగదారులు వాహనాలను రోడ్లపై నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, దుకాణాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. షాపుల యజమానులు పోటీ పడి సామగ్రి బయట పెడుతున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని యజమానులకు తెలియజేశారు.

ఏఐటీయూసీ ఏరియా సమితి అధ్యక్షుడిగా ఓవీ రాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏఐటీయూసీ ఏరియా సమితి గౌరవాధ్యక్షుడిగా డి.సోమసుందర్, అధ్యక్షుడిగా ఓవీ రాజు, ఉపాధ్యక్షుడిగా పడాల శ్రీనివాస్, తాడికొండ శ్రీనివాసరావు, మేకం నాగరాజు, కార్యదర్శిగా మందలపర్తి హరీష్, సంయుక్త కార్యదర్శిగా కళింగ లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే.లక్ష్మీ నారాయణ, సహాయ కార్యదర్శులుగా తాడేపల్లి వెంకటేష్, ఆకుల కాటమరాజు, కోశాధికారిగా కొడమంచిలి చంద్రరావు, మరో 25 మంది సభ్యులలో ఏరియా కౌన్సిల్ ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ విశాఖపట్నంలో ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీన జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం

భీమవరం: మానవతా సాంఘిక సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, కార్యదర్శి వేమూరి రాంబాబు మాట్లాడుతూ హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తున్నప్పటికీ స్వచ్ఛంద సంస్థలు, దాతలు పౌష్టికాహారం అందించడం వల్ల ఇమ్యూనిటీ పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈనెల పౌష్టికాహారం అందించడానికి ఆర్థిక సహాయం చేసిన సంస్థ సభ్యురాలు కలిదిండి పద్మావతిని అభినందించారు. సంస్థ చైర్మన్ పెద్దరాజు వెంకటపతిరాజు, సంస్థ కో–చైర్మన్ కార్మూరి బాబు, అల్లు శ్రీనివాస్, రాంబాబు, ఇందుకూరి ప్రసాదరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే గేటు సమస్య పరిష్కరించాలని వినతి

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో గోడౌన్స్ వద్ద ఉన్న రైల్వే గేటు సమస్య పరిష్కరించాలని కోరుతూ వాండ్రం గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పలువురు కేంద్రం మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేగేటును రాత్రి 7 గంటలకు మూసివేసి ఉదయం తెరుస్తున్నారని, ఈ గేటు నుంచి వాండ్రంతో పాటు ఐదారు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని, వీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, యాండంగి యేసు, బీజేపీ నాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు



ఉరదాళ్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: బాల్య వివాహాలు చేయించినా..ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ఆర్వీ కుమారి, జి నాగజ్యోతి, ఎం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మంపాడులో...

మహిళల చట్టాలను గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని అంగన్‌వాడీ కార్యకర్త పి గిరిజ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధించాలని, ఆడపిల్లలను చదివించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి రాజకుమారి, పి చిట్టిమరియమ్మ, ఏఎన్ఎం జి శిరీషా, ఆశా వర్కర్ యు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేయండి



ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

పెంటపాడు: తణుకు రహదారిలో ప్రత్తిపాడు వరకు ఆర్అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు శనివారం సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి రోడ్లను పరిశీలించారు. ప్రస్తుతం రోడ్లకు పడ్డ గుంతలను ప్రజల సౌకర్యార్థం పూడ్చాలన్నారు. రోడ్ల పనులకు సంబంధించి పనులు టెండర్ల దశకు చేరుకున్నా, వర్షాల కారణంగా పనులు ప్రారంభం కాలేదని అధికారులు తెలిపారు. జువ్వలపాలెం, ప్రత్తిపాడు, అలంపురం వరకు రహదారులను పరిశీలించారు.

సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నుంచి హైదరాబాద్‌కు నూతన సూపర్ లగ్జరీ ఏపీఎస్ ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడేలా ఏపీఎస్ ఆర్టీసీ నూతన సూపర్ లగ్జరీ బస్సు అందుబాటులోకి తీసుకురావడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి, అధికారిణి సుధారాణి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చోడగిరి వెంకట రమణ, ఎన్ఎంయూ సెక్రటరీ ఎ.రవికుమార్, ఆర్టీసీ సూపర్‌వైజర్లు, ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు, కండెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మోహనరావుకు అభినందనలు



పెంటపాడులో మోహనరావును సన్మానిస్తున్న మానవత సభ్యులు

పెంటపాడు: మండలానికి చెందిన పూర్వపు ఆంధ్రా బ్యాంక్ మేనేజర్, సంఘ సేవకులు, ఉమ్మడి జిల్లా విశ్రాంత మానవత చైర్మన్ తాడేపల్లి మోహనరావు ఇండియన్ ఐకాన్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం ఆయన స్వగృహంలో మండల మానవత సభ్యులు, పలువురు ప్రముఖులు మోహనరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం వల్ల మరింత బాధ్యత పెరిగిందని మోహనరావు పేర్కొన్నారు. తనను అవార్డుతో సత్కరించిన ఐకాన్ జాతీయ సంస్థ నిర్వాహకులతో పాటు, మంత్రులకు ఆయన మానవత తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంఘ సభ్యులు మీసాల సత్యనారాయణ, నక్కా సాంబశివ, బేతిరెడ్డి చంద్రశేఖర రెడ్డి, పీబీ శ్రీనివాసాచార్యులు, వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా కట్టాలి

పెనుమంట్ర: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 11, 12, 13 తేదీలలో ప్రతి కార్యకర్త ఇంటిపై జాతీయ జెండా కట్టాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆచంట అసెంబ్లీ బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల్లో జాతీయ భావం కలిగేలా కార్యక్రమాలు చేసి అన్ని మండలాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు నాగ సుబ్బారావు, బద్రి నారాయణ పాల్గొన్నారు.

వెన్నుపూస బాధితుడికి వాకర్స్ క్లబ్ సహాయం

పాలకొల్లు సెంట్రల్/యలమంచిలి: ప్రమాదంలో గాయపడి వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి పాలకొల్లు వాకర్స్ క్లబ్ తరపున చేయూతనిచ్చినట్లు క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు చెప్పారు. యలమంచిలి మండలం ఊటాడ గ్రామానికి చెందిన బి.శ్రీనివాస్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ ప్రమాదానికి గురికావడంతో దాతల సహకారంతో స్వదేశానికి తిరిగివచ్చాడు. ఆ ప్రమాదంలో వెన్నుపూసకు గాయమై అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని స్థానికులు కొందరు పాలకొల్లు క్లబ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో క్లబ్ స్పందించి అతనికి అవసరమైన రూ. 15 వేలు విలువ చేసే మందులను శనివరం అందించినట్లు సుధాకరరావు చెప్పారు. క్లబ్ సభ్యులు షేక్ ఫీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకర్, సోమంచి శ్రీనివాస శాస్త్రి, గ్రామ సర్పంచ్ బుడితి జయరాజు పాల్గొన్నారు.